## క్లుప్తంగా

### కలిసి పనిచేస్తాం..

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ ఎవరికి ఇచ్చినా, కలిసి కట్టుగా పని చేసి గెలిపిస్తామని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, ఊకంటి గోపాల్‌రావు, రాయల శాంతయ్య, ఆళ్ల మురళీ, మహిళా నాయకురాలు తోట దేవిప్రసన్న అన్నారు. శుక్రవారం సూర్యా ప్యాలెస్ హోటల్ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వర్గ విబేధాలు పక్కన బెట్టి పార్టీ అధిష్టానం చెప్పినట్లు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తామన్నారు. సకినాల వెంకటేశ్వరరావు, పల్లపు వెంకటేశ్వర్లు, జరీనా, రాజు, సుబ్బారెడ్డి, సత్యనారాయణ, వాలి, చంద్రకళ, నాగేంద్రత్రివేది, దుర్గారాశి సతీష్ తదితరులు ఉన్నారు.

**పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు**

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నేతలు ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

పాల్వంచరూరల్: ఎన్నికల నేపథ్యంలో లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంక్ వద్ద బీసీఎం జాతీయ రహదారిపై శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. ప్రధానంగా కార్లను లోపల, వెనక డిక్కీలను పోలీసులు సోదాలు చేశారు.

### సాహితీ డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇల్లెందు: పట్టణంలోని సాహితీ డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. డైరెక్టర్లు ఎంసీ నాగిరెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, రాంబాబు, రాధాకృష్ణ, దామోదర్ పాల్గొన్నారు.

### వైఎస్సార్ టీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా శ్రీకాంత్



టేకులపల్లి: వైఎస్సార్ తెలంగాణ పార్టీ యువజన విభాగం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా టేకులపల్లి మండలం తొమ్మిదో మైలుతండాకు చెందిన బానోతు శ్రీకాంత్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోతు సుజాత నియామకపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షురాలు ఇందుజారెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. తనకు జిల్లా పదవి ఇచ్చినందుకు నాయకులకు శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### పోలింగ్ స్టేషన్ల పరిశీలన



కేశవాపురంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని 90 పోలింగ్ స్టేషన్లను శుక్రవారం ఎన్నికల పోలీసు నోడల్ అధికారి కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లో తాగునీటి సౌకర్యం, ర్యాంప్‌లు, లైటింగ్ సౌకర్యాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీ వెంట సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐలు ఉన్నారు.

### 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఇల్లెందురూరల్: ఈ నెల 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు ఏర్పాటు కానున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

# వంద శాతం దిశగా | ఆధార్ అనుసంధానం

- నేరుగా కూలీల ఖాతాల్లోకి వేతనాలు
- ఉపాధి హామీ పనుల్లో మరింత పారదర్శకత



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

చుంచుపల్లి: ఉపాధి హామీ పథకం వేతన చెల్లింపుల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ అనుసంధాన ప్రక్రియ చేపట్టింది. ఈ విధానం అమలుతో కూలీల వేతనాల చెల్లింపుల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావించి ప్రతి జాబ్ కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేస్తున్నారు. ఉపాధి హామీ సిబ్బంది కొన్ని నెలలుగా కూలీల బ్యాంకు ఖాతాలను ఆధార్‌కు అనుసంధానించే పనిలోనే ఉన్నారు. జాతీయ స్థాయిలో వివిధ కారణాలతో నమోదు లేకపోవడంతో డిసెంబరు 31 వరకు గడువు పొడిగించింది. చుంచుపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం కూలీల జాబ్ కార్డులు ఆధార్ అనుసంధాన నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఆధార్ అనుసంధానం దాదాపు 98 శాతం వరకు నమోదు పూర్తయింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో కూలీల హాజరు కూడా గ్రామాల్లో అంతంత మాత్రంగానే ఉంది. ఆధార్ అనుసంధానంలో మొదట కొన్ని సమస్యలు ఏర్పడటంతో ఉపాధి కూలీలు కొంత ఆందోళన చెందారు. మండలంలో 7,385 జాబ్‌కార్డులు ఉండగా, వాటి పరిధిలో 14,068 మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. ఇందులో ప్రస్తుతం 2,939 యాక్టివ్ జాబ్ కార్డుల పరిధిలో 4,308 మంది కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందులో 50 శాతం ఎస్టీ కూలీలు ఉండగా, 20.94 శాతం ఎస్సీ కూలీలు ఉన్నారు. మొత్తం 4,308 కూలీలకు గానూ ఇప్పటివరకు 4,292 మందికి ఆధార్ నమోదు పూర్తిచేయగలిగారు. అయినప్పటికీ వంద శాతం పూర్తి చేసినప్పుడే కూలీలకు నేరుగా చెల్లింపు ప్రక్రియ కానుంది.

**అనుసంధానంతో పారదర్శకత...**

ఉపాధి హామీ పథకంలో మొదట్లో తపాలా శాఖ నుంచి కూలీలకు వేతనాలు పంపిణీ చేసేవారు. బీపీఎంలు (బ్రాంచ్ పోస్టు మాస్టర్లు) కూలీల పేరిట వేతనాలు స్వాహా చేయడంతో ఈ విధానం రద్దయింది. కొన్నాళ్ల తర్వాత కూలీల బ్యాంకు, తపాలా ఖాతాల నుంచి నేరుగా వేతనాలు విడుదల చేసుకుంటున్నారు.

దీంతో అక్రమాలకు కొంత అడ్డుకట్ట పడినట్లయింది. జాతీయ స్థాయిలో వేతన చెల్లింపులో పారదర్శకత పెంచేందుకు ఖాతాలతో ఆధార్ అనుసంధాన ప్రక్రియకు తెరతీశారు. అయితే ఆధార్ కార్డు లేని కూలీలు ఉపాధి కోల్పోతున్నారనే ఆరోపణలున్నాయి. జాతీయ స్థాయిలో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్పీసీఐ) విధానంలో భాగంగా ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్ (ఏబీపీఎస్) అమలు చేస్తున్నారు. బ్యాంకు, తపాలా శాఖల్లోని కూలీల ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానిస్తున్నారు. ఈ పోర్టల్లో ఉపాధి కూలీల పేరు నమోదు ఉంటేనే పని కల్పిస్తారు.

### కూలీలకు అవగాహన కల్పించాం



కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల బ్యాంకు ఖాతాల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలని సూచించింది. దాని ప్రకారం మొదట సెప్టెంబర్ వరకే గడువు ఇచ్చింది. ఆ గడువును దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించి ప్రక్రియను వేగవంతం చేశాం. ఈ గడువును ప్రభుత్వం డిసెంబర్ వరకు పెంచినందున మిగిలిన వాటిని కూడా పూర్తి చేస్తాం.

– పిల్లి నాగరాజు, ఉపాధి సిబ్బంది

### 98 శాతం పూర్తి



మండలంలోని ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ దాదాపు పూర్తయింది. ప్రతి ఉపాధి కూలీ వివరాలను నమోదు చేస్తున్నాం. ఇప్పటి వరకు 98 శాతం అనుసంధానం పూర్తి చేశాం. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి డిసెంబర్ వరకు అవకాశం కల్పించారు. ఆ గడువులోగా వంద శాతం నమోదుకు చర్యలు తీసుకుంటాం.

– రఘుపతి, ఏపీఓ

# రాబోయేది కాంగ్రెస్ పాలనే..



టేకులపల్లిలో ప్రచారం చేస్తున్న కోరం కనకయ్య

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ పాలన అని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది సీట్లు కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకుంటుందని జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లిలో రెండోరోజు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి టేకులపల్లి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. భూక్యా దేవా నాయక్, పూనెం సురేందర్, గడ్డం మధురెడ్డి, మోకాళ్ల పోశాలు, వాంకుడోత్ పూన్యా, బోడ మంగీలాల్, ఈది గణేష్, నర్సింగ్ లక్ష్మయ్య, ఇస్లావత్ రెడ్యానాయక్, బండ్ల శ్రీనివాస్, అఫ్రోజ్, సరిరాం, మూడ్ పవన్, బాణోతు రవి, రావూరి సతీష్, మూడ్ సంజయ్, అశోక్, అజ్మీర శివ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం..**

ఇల్లెందురూరల్: గడిచిన రెండుసార్లు చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా మరోసారి మోసపూరిత హామీలతో వస్తున్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు విశ్వసించొద్దని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. రేపల్లెవాగు, కొత్తూరు గ్రామాలలో పలు కుటుంబాలు శుక్రవారం కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి. కండువా కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటైన సభలలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఉచితంగా ఎరువులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వంటి అనేక హామీలను గాలికొదిలేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ అధినాయకత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పులి సైదులు, పాయం స్వాతి, కల్తి పద్మ, పాయం లలిత, మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, బానోత్ రోజా, సాంబమూర్తి, సూర్యం, ముక్తి కృష్ణ, తాటి బిక్షం, శారద, ఆముదాల ప్రసాద్, నాగార్జున్ పాల్గొన్నారు. అనంతరం ఇందిరానగర్‌లో అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన బండి వెంటకమ్మ (78)కు జెడ్పీ చైర్మన్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు అందని వేతనాలు



ఏరియాలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధిత కాంట్రాక్టర్ ప్రతినెల 7వ తేదీలోపు వేతనాలు అందజేయాలని, సదరు కాంట్రాక్టరు ఇవ్వని పక్షంలో ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా సింగరేణి యాజమాన్యం బాధ్యత వహించి అదేరోజు వేతనాలు ఇవ్వాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సింగరేణి యాజమాన్యానికి, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాలను బేఖాకరు చేస్తూ ఈనెల 14వ తేదీ వచ్చేంత వరకు కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం సివిక్ కార్మికులకు వేతనాలు వేయలేదని కార్మికులు వాపోతున్నారు. నెలంతా ఏరియాలోని కాలువలు శుభ్రం చేసి, చెత్తా చెదారం ఎత్తి, ఎండనక, వాననక, కాంట్రాక్టర్ చెప్పిన పనులు క్రమం తప్పకుండా చేస్తున్నా వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడం సరైందికాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ కార్మికులకు సకాలంలో ఇచ్చారా, లేదా తెలుసుకోవాల్సిన సింగరేణి సివిల్ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు.

కార్మికులకు సకాలంలో వేతనాలు ఇప్పించి, కార్మికుల సమస్యలను యాజమాన్యంతో చర్చించి వారికి న్యాయం చేయాల్సిన కార్మిక సంఘాల నాయకులు నోరుమెదపడక పోవటంలో ఆంతర్యమేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, యాజమాన్యం స్పందించి కార్మికులకు సకాలంలో వేతనాలు అందించిలని కాంట్రాక్ట్ కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు



కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని పోచారంతండా గ్రామపంచాయతీ పరిధిలోని పోచారం, అమర్‌సింగ్‌తండా, పందిరిమంగ్యా తండా గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాయి. వారికి ఎమ్మెల్యే హరిప్రియ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించామని, తొంబై శాతం వరకు అంతర్గత రహదారులను సీసీలుగా మార్చుకున్నామని గుర్తుచేశారు. ఇల్లెందుకు చిరకాల స్వప్నమైన బస్‌డిపో సాధించుకున్నట్లు చెప్పారు. వీటితోపాటు రైతులకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, పింఛన్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేశామని తెలిపారు. కేజీ నుంచి పీజీ ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రతి మండలానికి రెండు నుంచి మూడు వరకు గురుకులాలు మంజూరు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన గోదావరి జలాలను సరఫరా అవుతున్నాయని, ప్రతిగ్రామంలోనూ సాగునీటి వనరులను అభివృద్ధి చేయడం వల్లే నేడు పల్లెలన్నీ సుభిక్షంగా ఉన్నాయని చెప్పారు. తండాలను, గూడేలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంతోపాటు పల్లెలకు మౌలిక సదుపాయాలు కల్పించిన ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఘన విజయం అందించి మరోసారి రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్‌ను ఎన్నుకోవాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, నాయకులు నాగేశ్వరరావు, గైగొళ్ల శ్రీను, లష్కర్, దేవ్లా తదితరులు పాల్గొన్నారు.

### స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శిరీష ఆదేశాల మేరకు డిప్యూటీ డెమో ఎండీ ఫైజ్‌మోహియుద్దీన్, కొత్తగూడెం పట్టణంలోని వి కేర్ మల్టీసెష్పాలిటీ ఆస్పత్రిలో స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రామవరంలోని ఎంసీహెచ్‌లోని స్కానింగ్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ బేబీ, జూనియర్ అసిస్టెంట్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### డ్రెయినేజీలో ఇరుక్కుపోయిన పాడిగేదె

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మగుడి సమీపంలో బీసీఎం జాతీయ రహదారి పక్కన డ్రెయినేజీలో గురువారం రాత్రి గేదె పడిపోయి ఇరుక్కుపోయింది. తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జగన్నాథపురం సర్పంచ్ అనిత స్పందించి పంచాయతీ కార్మికులు, జేసీబీ సాయంతో శుక్రవారం గేదెను బయటకు తీశారు.

### తల్లిదండ్రులతో సమావేశం



హాజరైన విద్యార్థినులు, తల్లిదండ్రులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం పేరెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ డాక్టర్ జి.శైలజ, చీఫ్ వార్డెన్ డాక్టర్ సీహెచ్ పావని హాస్టల్ నియమ నిబంధనలను వివరించారు. ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ.. విద్యార్థినుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంత ఉంటుందో తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే ఉంటుందన్నారు. కళాశాల, హాస్టల్ నియమనిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చే విధంగా చదువుకోవాలని సూచించారు.

# పాలిటెక్నిక్ కళాశాలలో 'అమృత్ కలష్ యాత్ర'




అమృత్ కలష్ యాత్రలో పాల్గొన్న విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం కొత్తగూడెం ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ మాంకాల నరేందర్ ఆధ్వర్యంలో మేరీ మిట్టీ మేరీ కలాష్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగముని నాయక్ హాజరయ్యారు. విద్యార్థులచే అమృత్ కలష్ యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలోని మట్టిని సేకరించి ప్యాకింగ్ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశంలోని అమరవీరుల జ్ఞాపకార్థం ప్రతి గ్రామం నుంచి ఢిల్లీలోని కర్తవ్య పథ్‌కు మట్టిని తరలించి అందులో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సేకరించిన మట్టిని ఢిల్లీ పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



మాట్లాడుతున్న జీఎస్ఆర్ ట్రస్టు సభ్యులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌లోని జనహిత ప్రాగణంలో జీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నేటి నుంచి బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నామని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ట్రస్టు కోఆర్డినేటర్ మోదుగు జోగరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జనహిత ప్రాగణంలో తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ట్రస్టు చైర్మన్ గడల శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఈ వేడుకులు నిర్వహిస్తున్నామని, తొమ్మిదో రోజు మహిళలకు బహుమతులు ప్రదాన చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజర్ చంద్రగిరి అంజి, ఆరేళ్ల శ్రీను, ప్రబాకర్, జీవీఆర్ ప్రసాద్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

జూలూరుపాడు: 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జూలూరుపాడు సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా అమ్మవారి మండపాలను ఏర్పాటు చేయరాదన్నారు. ఎలాంటి గొడవలు, వివాదాలకు తావు లేకుండా పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మండపాల్లో డీజే, లౌడ్ స్పీకర్లు, మైకులు ఉపయోగించవద్దని చెప్పారు. ఏమైనా ఘర్షణలు జరిగితే ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాలని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పోలీసులకు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ప్రజలంతా దసరా పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్ఐ బి.పురుషోత్తం, హెడ్‌కానిస్టేబుల్ శివాజీ గణేష్, కానిస్టేబుల్స్ వెంకట్, ప్రసాద్, సూర్యం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గణేష్ టెంపుల్‌లో స్వచ్ఛ పక్వాడా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం గణేష్ టెంపుల్ చెమన్‌లో శుక్రవారం ఆజ్ కీ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ పక్వాడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా సివిల్ సూపర్‌వైజర్ మత్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడి ఆవరణలో ఉన్న చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సింగరేణి సీఅండ్ఎండీ, డైరెక్టర్(పా), సివిల్ జీఎంలతోపాటు ఏజీఎం, ఎస్ఈల ఆదేశాల మేరకు మన పరిసరాల్లో కార్యాలయాలు, కాలనీలు, ఇతర దేవాలయాల్లో ఉన్న అపరిశుభ్రతను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేయాలని సూచించారని, వారి ఆదేశాల మేరకు ఈరోజు గణేష్ టెంపుల్ చెమన్ ఆవరణను పరిశుభ్రం చేశామన్నారు. ఆలయ నిర్వాహకులు జూపాక రమేష్, సత్యనారాయణ, పిట్ సెక్రటరీ శనిగరపు కుమార్, జే.రమేష్, ఇతర కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం



మాట్లాడుతున్న లక్కినేని సురేందర్

సుజాతనగర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు లక్కినేని సురేందర్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో సీతంపేట, సీతంపేట బంజర, కోమటపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. దేశంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసింది ఇక చాలన్నారు. రాష్ట్రంలోని అర్హులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలన, 10 ఏళ్లుగా టీఆర్‌ఎస్ పాలన ప్రజలు చూశారని, ఇప్పుడు బీజేపీని ఆదరించాలంటూ పిలుపునిచ్చారు. అంతకుముందు వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా వారిని సురేందర్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో లక్కినేని సాయి, గుగులోత్ మోహన్, రాచబంటి నాగరాజు, బూరుగు విజయ్‌బాబు, చక్రీ, రామకృష్ణ, వేణు, సింగ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**అంబసత్రం భూములకు హక్కులు కల్పిస్తాం..**

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే అంబసత్రం భూములకు హక్కులు కల్పిస్తామని లక్కినేని సురేందర్ అన్నారు. శుక్రవారం ఆయన లక్ష్మీదేవిపల్లి మండలంలోని లాలు తండాలో పర్యటించారు. మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి, వాటిని అమలు చేయటంలో విఫలమైందన్నారు. ధరావత్ బాలాజీ నాయక్, మాలోతు గాంధీ, మహాలక్ష్మి, పార్వతి, బుజ్జి పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ముందస్తుగా బతుకమ్మ సంబురాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య, అధ్యాపకులు జై.అబ్రహం, డాక్టర్ అరుణకుమారి, స్వరూపరాణి, ఎస్.శ్రీదేవి, కె.కార్తీక్, రాంబాబు, విజయ్‌కుమార్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు కె.రవీంద్రబాబు, సంపత్, స్వరూప, గోపాలకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

**సింగరేణి మహిళా కళాశాలలో..**

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**డిగ్రీ కళాశాలలో పూల పండుగ**

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పూల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను అందంగా పేర్చి కళాశాలకు తీసుకొచ్చారు. కళాశాల ప్రాంగణంలో గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేసిన విద్యార్థులు బతుకమ్మలను ఒకచోటకు చేర్చి ఆడిపాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు పులిగళ్ల మాధవరావు, వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

**పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..**

పాల్వంచ: పట్టణంలోని సీతారాంపట్నం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షురాలు సుధశ్రీ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు జ్యోతి, మాధవి, మహాలక్ష్మి, శ్రీదేవి, పద్మ, కవిత, కామేశ్వరి, సుజాత, పద్మజ, కృష్ణవేణి, షీలారాణి, రేణుక, హైమావతి, దుర్గారాణి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, సంగమేశ్వరరావు, కిరణ్, పూర్ణ పాల్గొన్నారు.



పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): బతుకమ్మ సంబురాల్లో అధ్యాపకులు, విద్యార్థినులు